# అరుగరుగో సుబ్బయ్య మేష్టారు—



అరుగో సుబ్బయ్య మేష్టారొస్తున్నారు. అంటే సుబ్బయ్య మాష్టారు రావటం లేదు. ఒక గేదె, ఓ దూడ స్కూలు ఆవరణలోకి అడుగుపెడ్తున్నాయి. వాటి వెనకాల ఇద్దరు కర్రలుచ్చుకుని వాటిని తోలుకుంటూ వస్తున్నారు. అవి సుబ్బయ్య మేష్టారి పశువులు, వాళ్ళిద్దరూ సుబ్బయ్య మేష్టారి శిశువులు. ఆవరణలో గునపాలు పాతి ఆ గేదెని, దూడని కట్టేశాక ఎవరి క్లాసుకు వాళ్ళు వెళ్ళిపోయారు పిల్లలు. ఆ వెనక సుబ్బయ్య మేష్టారు వచ్చారు. ఇంకో

సంవత్సరంలో రిటైరు కావాలి. వాలిపోతున్న కళ్ళజోడు సర్దుకుంటూ నేల చూస్తూ నడుస్తున్నారు. ఉత్తరీయాలు ఎప్పుడో మానేశారు. భార్య పోయింతర్వాత చొక్కా చిరుగు కుట్టేవారు లేకపోతే కొంతకాలం చిరుగుల్ని కప్పుకోడానికి ప్రయత్నించేవారు. ఇప్పుడదీ మానేశారు.

మేష్టార్ని చూడగానే గేదె మోరెత్తి అరిచింది. మేష్టారు దగ్గరకెళ్ళి మూపు నిమిరి నాలుగు గడ్డి పరకలు నోటికందించి "క్లాసుకు టైమైంది మళ్ళీ వస్తా" అంటూ గంట కొడ్తుండగా క్లాసులో అడుగుపెట్టారు. వస్తూనే ముందు హోంవర్కు తీయమన్నారు. అందరూ చేశారు కాని సుబ్బరాజు చేయలేదు. మేష్టారికి చెడ్డ కోపం వచ్చింది. "స్టాండ్అప్ ఆన్ ది బెంచ్" అన్నారు. అంతలో జ్ఞాపకం వచ్చి "ఒరేయ్! ఇది రెండోసారి కదూ హోంవర్క్ మానేయటం! అదికాదు నీకు శిక్ష! వెళ్ళు! కాస్త గడ్డికోసి ఆ గేదెకి, దూడకి వేసి రా!" అని పంపించేశారు.

ఓ ఐదు నిముషాలకి సుబ్బరాజు తిరిగొచ్చాడు. వాణ్ణి ఆప్యాయంగా నిమిరాడు. 'ఓరి వెధవా! ఆ గేదెవుంది చూశావా! దానికి గడ్డివేస్తే పాలిస్తుంది. మీ నాన్నా నీకు అన్నంపెట్టి, గుడ్డలిచ్చి ప్రేమగా చూసుకుంటున్నాడు-నువ్వాయనకు పాలూ ఇవ్వక్కర్లేదు, మీగడా పెట్టక్కర్లేదు. నీ చదువు నువ్వు చదువుకోకపోతే ఆ గేదెకంటె హీనమే గదా! అంటూ చెప్తుంటే సుబ్బరాజు కళ్ళ నీళ్ళయిపోయాడు. అంతే! ఆరోజు నించి వాడు హోంవర్కు మానలేదు.

స్కూలు విడిచిపెట్టాక ఆ దృశ్యం చూడవలసిందే! ఈమారు సుబ్బయ్య మేష్టారే పలుపు పుచ్చుకుని గేదెని, దూడని ముందుకు నడిపించుకు వెళ్తుంటే ఓ పాతికమంది పిల్లలు ఎవరికి తోచిన గడ్డి వాళ్ళు కోసి వెనక నడుస్తుండేవాళ్ళు. అలా ఇంటిదాకా వెళ్ళి గడ్డి వరండాలో పడేసి ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోయారు.

పిల్లలకి మేస్టారంటే ఎంత భక్తో మేష్టర్లందరికీ తెలుసు. ఆయనకి కోపం వచ్చినా ఎంత సున్నితంగా మనసుకు పట్టేట్లు లెక్కలు చెప్తారో పిల్లలు ఇళ్ళల్లో

చెప్పుకునేవారు. కొందరికి కళ్ళలోకి చూస్తూ చెప్పేవారు. కొందరికి వీపు నిమురుతూ చెప్పేవారు. ఎవరైనా భయస్థుడైన మందమతి ఉంటే వాణ్ణి వొళ్ళో కూర్చోపెట్టుకు చెప్పేవారు. అలాగాయన పాఠం పిల్లలకి గొప్ప సరదా, లెక్క లెక్కకీ మధ్య ఆయన చెప్పే పిట్టకథ పిల్లలు రోజులు రోజులు చెప్పుకునేవారు. పిల్లలతో కూర్చుంటే మేస్టారికి పొద్దూ తెలియదు. ఆకలీ తెలియదు.

సుబ్బయ్య మేస్టారు రిటైరై పోయారు.

ఆ రోజు మేస్టారి పిల్లలిద్దరే స్కూలు కొచ్చారు. గేదె రాలేదు. దూడా రాలేదు. ఆ వెనక జారుతున్న కళ్ళజోడు సర్దుకుంటూ సుబ్బయ్యగారు రాలేదు. ఆవరణ బోసిగా వుంది.

పిల్లలకి చదువెక్కలేదు. పచ్చగడ్డి దిగులుదిగులుగా ఉంది. రీసెస్‌లో గేదెని, దూడని పలకరించే పిల్లలకి టిఫిన్ సయించలేదు. స్కూలు గడియారం పనిచేయనట్టు స్కూలు బెల్లు విరిగిపోయినట్టు వుంది. జేబుల్లో తెచ్చుకున్న తాయిలం ఎక్కడో జారిపోయినట్టు అందరి ముఖాల్లో దిగులు .

సాయంత్రం వందమంది పిల్లలు, రెండుచేతులా గడ్డికోసుకుని సుబ్బయ్య మేస్టారి ఇంటికెళ్ళారు. ముందు ఖాళీస్థలంలో గేదెముందు దిగులుగా కూర్చున్న మేస్టారు కన్పించారు. ఏవరూ ఏమీ మాట్లాడలేదు. తెచ్చిన గడ్డి గుట్టగా గేదెముందు పోశారు. గేదె సంబరంగా తింటోంది. సుబ్బయ్య మేస్టారు కదిలిపోయారు. "ఒరే అయ్యలూ! నాకోసం ఇంతదూరం వచ్చార్రా! పొద్దుట్నించీ కాళ్ళూ, చేతులూ ఆడ్డం లేదురా! అన్నం సయించలేదు. నాకు ఒక్క సాయం చేయండ్రా! ఇంటికి వెళ్ళిపోతూ పోతూ నాచేత ఒక్క లెక్క చెప్పించుకు వెళ్ళండ్రా -- చాలు" అన్నారు. "తప్పకుండా" అన్నారు పిల్లలు.

గేదెవైపు తిరిగి అన్నారు మేస్టారు. "నీకు చక్కటి పచ్చగడ్డి తింటే ఆకలి తీరుతుంది. నాకు పిల్లలకి ఒక్కపాఠం చెప్తే కడుపు నిండుతుంది." ❋